## అర్హులైన నిరుపేదలు
# డబుల్‌బెడ్‌రూం ఇండ్లకు ధరఖాస్తు చేసుకొండి...

**- మధ్యవర్తులు, దళారులను నమ్మిమోసపోవద్దు...**

**- జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మార్చి 20 ప్రభాతవార్త:** దారిద్ర్య రేఖకు దిగువన ఉండి ఇండ్లు లేని నిరుపేదలు డబుల్ బెడ్‌రూం ఇండ్లకు ధరఖాస్తులు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డబుల్ బెడ్‌రూం ఇండ్లకు స్థానికులు మాత్రమే అర్హులని, ఎక్కడ నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇండ్లకు అక్కడి నిరుపేదలు మాత్రమే మీ సేవా ద్వారా దరఖాస్తులు చేసుకోవాలి. అచ్చంపేట మున్సిపాలిటిలో 150, కల్వకుర్తి మున్సిపాలిటిలో 240, పెద్దముద్దనూర్‌లో 30 ఇండ్లను నిరుపేదలకు కేటాయించడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. స్థానికులు మాత్రమే ధరఖాస్తు చేసుకోవడానికి అర్హులని, మార్చి 21వ తేదీ వరకు నుంచి మార్చి 27వ తేదీ వరకు మీ సేవా కేంద్రాల్లో తగిన ధృవపత్రాలతో ఆన్‌లైన్‌లో ధరఖాస్తు చేసుకోవాలన్నారు. రేషన్ కార్డు, ఓటర్ ఐడీ కార్డు, ఆధార్, బ్యాంక్ పాసు బుక్, కుల ధృవీకరణ పత్రం, ఇటీవలీ ఆదాయ ధృవపత్రం, కుటుంబ సభ్యుల వివరాలతో మీ సేవా కేంద్రంలో రూ.45లు చెల్లించి ధరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దళారులను, మధ్యవర్తులను నమ్మి మోసపోవద్దన్నారు. ఆన్‌లైన్ ద్వారా వచ్చిన ధరఖాస్తులను మార్చి 29న అధికారులు స్థానికంగా గ్రామ సభ నిర్వహించి నిబంధనల అనుసారం అర్హులైన లబ్దిదారులను ఎంపిక చేయడం జరుగుతుందన్నారు.


కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్

## ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా కలెక్టర్

**నారాయణపేట ప్రతినిధి,మార్చి 20 ప్రభాతవార్త :** ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష నేరుగా ఫిర్యాదుదారుల నుండి తానేస్వయంగా స్వీకరించారు. సోమవారం ప్రజావాణి హాల్‌లో జిల్లా అధికారులతో కలిసి ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ జిల్లాలో ధరణి, భూ, రెవెన్యూ, ఇతరత్రా సమస్యలతో నేరుగా కలెక్టరేట్‌కు వచ్చి ఫిర్యాదు చేయవచ్చన్నారు. పనులు చేయిస్తామని చెప్పే దళారులు చెబుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని అలాంటి వ్యక్తులను నమ్మవద్దని హెచ్చరించారు. దళారుల చేతిలో ప్రజలు మోసపోవద్దని జిల్లా కలెక్టర్ ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా అన్నారు. ఆయా ప్రభుత్వ శాఖలకు సంబంధించి ఉన్న సమస్యలను కలెక్టరేట్‌లో మాట్లాడి పరిష్కారం అయ్యే విధంగా చూస్తామని ఎవరు చెప్పినా ప్రజలు నమ్మవద్దని తెలియజేశారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిలో సమస్యలు ఫిర్యాదు చేయాలని, ఇప్పటికే చాలామంది సమస్యలు తన దృష్టికి తీసుకురావడం జరిగిందన్నారు. తన పరిధిలో ఉన్నవాటిని వెంటనే పరిష్కరించడం జరిగిందన్నారు. ప్రజలను మోసపోకుండా తమ సమస్యలను నేరుగా కలెక్టరేట్‌కు వచ్చి విన్నవించుకోవచ్చన్నారు. ఎవరైనా మోసం చేసినట్లయితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమస్యల పరిష్కారానికి అధికారులు సిద్ధంగా ఉన్నారని, సమస్యలతో వచ్చిన ఆర్జీదారునికి సలహాలు, సూచనలు అందించడంతో పాటు సమస్యలను సత్వరమే పరిష్కరించేటట్లు కృషి చేస్తామన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ నర్సింగ్‌రావు,పిఎస్ నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.


ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ కోయ హర్ష

## ప్రజావాణి ఫిర్యాదులు త్వరితగతిన పరిష్కరించాలి:ఎస్‌పి

**వనపర్తి క్రైమ్,మార్చి20,ప్రభాతవార్త:** ప్రజా సమస్యల పరిష్కరం కోసమే ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ రక్షిత కె.మూర్తి అన్నారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని పలు ప్రాంతాల నుండి 12మంది ఫిర్యాదుదారులు వచ్చారని, ఫిర్యాదులదారులతో ఎస్పీ స్వయంగా మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సంబందిత పోలీసు అధికారులకు ఫిర్యాదుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఎస్పీ ఆదేశించారు. 07 భూ ఫిర్యాదులు, 02 భార్యభర్తల ఫిర్యాదులు, 03 పరస్పర దాడుల ఫిర్యా దులు మొత్తం 12 ఫిర్యాదులు స్వీకరించినట్లు ఎస్పీ తెలిపారు.


ఫిర్యాదుదారు దారులతో సమస్య అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ రక్షిత కె.మూర్తి


మహబూబ్‌నగర్ వార్త



నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట


# వందేళ్లు గుర్తుండిపోయేలా... పనులు చేపట్టాం..!



- తెలంగాణ ప్రజల ప్రేమ గొప్పది.. తెలంగాణ అందరిని ప్రేమస్తది..
- 700 ఏళ్లక్రితం నిర్మించిన గణపసముద్రం,
- వనపర్తి రాజులు నిర్మించిన గోపాల సముద్రాన్ని పునరుద్ధరిస్తాం..
- ముఖ్యమంత్రి కెసిఆర్ సహకారంతో శాశ్వతంగా నిలిచిపోయే అభివృద్ధి చేశాం..
- పెద్ద ఎత్తున చెక్‌డ్యాంల నిర్మాణం పూర్తిచేశాం..
- గ్రామాలు, తండాలకు సిసి, బిటి రహదారులను నిర్మించాం..
- రాష్ట్రంలో అత్యంత ఎక్కువగా సిసి రహదారులు వేసిన నియోజకవర్గం వనపర్తి
- కానాయపల్లి నుండి పెద్దమందడి చెరువుకు లిఫ్టును ఏర్పాటుచేస్తాం..
- వేలాదిగా తరలివచ్చి ఆత్మీయ సమ్మేళనం విజయవంతం చేసిన అందరికి కృతజ్ఞతలు
- వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

**వనపర్తి ప్రతినిధి,మార్చి 20 ప్రభాతవార్త:** వనపర్తి నియోజకవర్గం పెద్దమందడి మండలం వెల్టూరు గ్రామం గోపాల సముద్రం వద్దనిర్వహించిన బిఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి హాజరయ్యారు. ఆయనతో పాటు పార్టీ జిల్లా ఇంచార్జి,ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవిందర్‌రావు, జిల్లా పార్టీ అధ్యక్షులు, మున్సిపల్ చైర్మన్ గట్టు యాదవ్, రైతుబంధు సమితి జిల్లాఅధ్యక్షులు జగదీశ్వర్‌రెడ్డి,జడ్పీటిసిలు రఘుపతిరెడ్డి, రాజశేఖర్ రెడ్డి, మార్కెట్ చైర్మన్ పలుసు రమేష్‌గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్, మండల వైస్ ప్రెసిడెంట్ రఘుప్రసాద్, మండల బిఆర్ఎస్ అధ్యక్షులు వేణుయాదవ్, మండల రైతుబంధు సమితి అధ్యక్షులు రాజాప్రకాష్‌రెడ్డి, సింగిల్ విండో ఛైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, వార్డు మెంబర్లు పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ 700ల ఏళ్ల క్రితం నిర్మించిన గణపసముద్రం, వనపర్తి రాజులు నిర్మించిన గోపాల సముద్రాన్ని పునరుద్ధరిస్తున్నామన్నారు. వందల ఏళ్లు గుర్తుండిపోయేలా పనులు చేపట్టామని ఇవి చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోతాయన్నారు. ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడిగా వనపర్తి నియోజకవర్గంలో 70 వేల ఎకరాలకు సాగునీరు అందించిన తర్వాతనే గత ఎన్నికల్లో నామినేషన్ వేశానన్నారు. పెద్దఎత్తున - మిగతా4లో..


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రవిందర్‌రావు


మంత్రి, ఎమ్మెల్సీలకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న దృశ్యం




కార్యక్రమంలో పాల్గొన్న కార్యకర్తలు,నాయకులు

## ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం వద్దు..

**మహబూబ్‌నగర్ కలెక్టర్ జి.రవినాయక్**

**మహబూబ్‌నగర్ ప్రతినిధి,మార్చి 20,ప్రభాతవార్త :** ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులను పరిష్కరించడంలో ఎలాంటి జాప్యం చేయొద్దని మహబూబ్‌నగర్ కలెక్టర్ జి రవినాయక్ అన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం ఐడీవోసీలోని సమావేశ మందిరంలో ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఫిర్యాదులను తానే స్వీకరించి ఫిర్యాదుదారులతో మాట్లాడారు. మండల స్థాయిలో పరిష్కరించాల్సిన ఫిర్యాదులను సంబంధిత తాసిల్దార్లు,ఎంపీడీవోలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి సమస్యల పరిష్కారానికి ఆదేశించారు. జిల్లా స్థాయి అధికారులతో పరిష్కారం అయ్యే సమస్యలను జిల్లా అధికారులతో నేరుగా చర్చించారు. కాగా గత సోమవారం ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ప్రజావాణి కార్యక్రమం రద్దు కాగా, సోమవారం పెద్ద మొత్తంలో ఫిర్యాదులు అందాయి. వ్యక్తిగత సమస్యలతో పాటు, భూ సంబంధిత, ఉపాధి, ఉద్యోగ ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో ఆర్డీవో అనిల్‌కుమార్, స్పెషల్ కలెక్టర్ పద్మశ్రీ,డీఆర్‌డీవో యాదయ్య, డీపీఆర్‌వో వెంకటేశ్వర్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ రవినాయక్

## ఓటమి గెలుపుకు నాంది...

**- క్రికెట్ క్రీడల ప్రారంభం... - ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్**

**కల్వకుర్తి, మార్చి 20 ప్రభాతవార్త:** క్రీడాకారులు క్రీడల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించి స్నేహ భావంతో ముందుకు సాగాలని నేటి ఓటమి రేపటి గెలుపుకు నాందిగా భావిస్తూ క్రీడాకారులు సమయస్ఫూర్తితో ముందుకు సాగాలని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. కల్వకుర్తి మున్సిపల్‌లోని మినీ స్టేడియంలో కల్వ కుర్తి క్రికెట్ క్రీడాకారుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కల్వకుర్తి ప్రీమియర్ లీగ్-2 క్రికెట్ పోటీల ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, కల్వకుర్తి బీఆర్ఎస్ పార్టీ నాయకులు బృంగి ఆనంద్‌కుమార్, ఎంపీపీ సామ మనోహర, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, ఎన్ఆర్ఐ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డిలు హజరై క్రీడాకారులను పరిచయం చేసుకొని క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ క్రీడలతో పాటు క్రికెట్ పోటీలను నిర్వహించడం, పల్లెల్లో కోలహాలంగా మారుతుందన్నారు. క్రీడలు స్నేహబంధాన్ని పెంపొందిస్తాయని, ప్రస్తుత కాలంలో శారీరక శ్రమ తగ్గిపోయిందని, శ్రమను పెంపొందించడంలో క్రీడలు ఎంతో తోడ్పడుతాయన్నారు. ఓటమి గెలుపుకు నాంది అని, ప్రతి క్రీడాకారుడు ఓటమి చెందితే నిరుత్సాహ పడవద్ధని, భవిష్యత్తులో ఎన్నో విజయాలు సాధించేందుకు అవకాశాలు కలిసి వస్తాయని భావించి క్రీడాకారులతో స్నేహ పూర్వకంగా కలిసి మెలిసి ఉండాలన్నారు. క్రీడల వల్ల ఎక్కడో ఉన్న వ్యక్తులతో పరిచయాలు ఏర్పడి స్నేహబంధాలు ధృడంగా మారి ఎన్నో అవకాశాలు కలిసి వస్తాయని, వాటితో అభివృద్ధి చెందేందుకు కూడా ఉపయోగపడుతాయని పేర్కొన్నారు.గ్రామీణ క్రీడలను పెంపొందించేందుకు అధికారులు, ప్రజా ప్రతినిధులకు,గ్రామయువకులకు పొత్సాహం కల్పించి క్రీడలను మరుగున పడకుండా అభివృద్ధి చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు.క్రీడా ప్రారంభోత్సవాలకు విచ్చేసిన ప్రముఖులను నిర్వాహకులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొండూర్ గోవర్ధన్, కౌన్సిలర్లు ఏజాస్, గోరటి శ్రీనివాసులు, నాయకులు మందా రాజేందర్‌రెడ్డి, మీర్ తాహేర్ అలీ, దామోదర్ గౌడ్, వట్టెపు బాలయ్య, తాళ్ల సురేష్ తదితరులు ఉన్నారు.


పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే


క్రికెట్ పోటీల ప్రారంభోత్సవానికి విచ్చేసిన ఎమ్మెల్యే, పలువురు నేతలు

# 2,39,835 మందికి కంటి పరీక్షలు..!



ఆరోగ్య తెలంగాణే లక్ష్యంగా అంధత్వ నివారణకు సర్కార్ నడుం బిగించింది. రెండో విడుత కంటి వెలుగు పరీక్షలు నిర్వహించేందుకు వైద్య ఆరోగ్య శాఖ జనవరి నుంచి శిబిరాలు నిర్వహిస్తున్నది. ఇందులో భాగంగా మహబూబ్‌నగర్ జిల్లాలో 191 గ్రామపంచాయతీల్లో కంటి పరీక్షలు నిర్వహించారు. ఇప్పటికీ 56శాతం మందికి కంటి వెలుగు పథకం కింద పరీక్షలు నిర్వహించినట్లు అధికారులు చెబుతున్నారు. 2023 జనవరి నెలలో రెండో విడుత పథకం ప్రారంభం కాగా ఏప్రిల్ నెలలో ముగియనున్నది.

- నిరంతర కంటి వెలుగులు - విజయవంతంగా నేత్ర పరీక్షలు
- మహబూబ్‌నగర్ జిల్లాలో 2.39లక్షల మందికి టెస్టులు
- 191 గ్రామపంచాయతీల్లో శిబిరాలు
- ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి : కలెక్టర్ రవినాయక్


కంటి వెలుగులో భాగంగా పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

**మహబూబ్‌నగర్ ప్రతినిధి,మార్చి 20,ప్రభాతవార్త :** కంటి సంబంధిత సమస్యలతో ఎవరూ కూడా ఇబ్బందులు పడొద్దని పేదలను సకల జనులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు, కళ్లద్దాలు పంపిణీ చేసేందుకు శ్రీకారం చుట్టిన పథకం కంటి వెలుగు. మొదటి విడుదల విజయవంతంగా పూర్తి చేయగా మరో విడుత రాష్ట్ర వ్యాప్తంగా పరీక్షలు నిర్వహించేందుకు సన్నద్ధమైంది. జనవరి నుంచి ఏప్రిల్ వరకు గ్రామ పంచాయతీ, పీహెచ్‌సీల్లో 100రోజుల ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనున్నారు. ఉమ్మడి జిల్లాలో 38లక్షల మందికి కంటి పరీక్షలు నిర్వహించడమే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించారు. గ్రామీణ ప్రాంతాల్లో చాలా మంది కంటి సంబంధిత సమస్యలతో బాధపడుతున్నా పెద్దగా పట్టించుకోరు. ఈమేరకు 18 ఏండ్లు పైబడిన ప్రతి ఒక్కరికీ పరీక్షలు నిర్వహించి మందులు, కంటి అద్దాలు ఉచితంగా పంపిణీ చేయాలని ఆదేశించింది. ఈమేరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శిబిరాలు నిర్వహిస్తున్నారు.

**రెండో విడుతలో..** మహబూబ్‌నగర్ జిల్లాలో ఇప్పటివరకు 2లక్షల39వేల 835 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 1,13,023 మంది పురుషులు,1,26,798 మంది మహిళలు ఉన్నట్లు వెల్లడించారు. పరీక్షల నిర్వహిణలో భాగంగా ఇప్పటివరకు 191 గ్రామ పంచాయతీల్లో కంటి పరీక్షలు పూర్తి చేసినట్లు తెలిపారు. 26 గ్రామపంచాయతీల్లో కార్యక్రమం పురోగతిలో ఉందని,అలాగే 41 మున్సిపల్ వార్డుల్లో సైతం కంటి వెలుగు కార్యక్రమాన్ని పూర్తి చేయగా, మరో 10 వార్డుల్లో కార్యక్రమం కొనసాగుతున్నట్లు వివరించారు.

**అద్దాలు పంపిణీ..**

మహబూబ్‌నగర్ జిల్లాలో ఇప్పటివరకు 35702 మందికి రీడింగ్ అద్దాలు పంపిణీ చేయగా 40ఏండ్లలోపు వారు 5147 మంది ఉండగా, 40 ఏండ్లు పైబడిన వారు 30,548మంది ఉన్నారని తెలిపారు. 25121 మందికి ప్రిస్కిప్షన్ అద్దాలు ఇచ్చేందుకు గుర్తించగా,8112 మందికి అద్దాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఇంకా 17009 మందికి ప్రిస్క్రిప్షన్ అద్దాలు ఇవ్వాల్సి ఉందని పేర్కొన్నారు. లక్షా79వేల10మందికి ఎలాంటి కంటి సమస్యలు లేవని గుర్తించినట్లు వివరించారు.

**సద్వినియోగం చేసుకోవాలి..**

సామూహిక స్క్రీనింగ్ నిర్వహించి, పేద రోగులకు ఉచితంగా నాణ్యమైన కళ్లద్దాల పంపిణీ చేయడమే లక్ష్యంగా కంటి వెలుగు కార్యక్రమం కొనసాగు తున్నది. మహబూబ్‌నగర్ జిల్లాలో మొత్తంగా 18ఏండ్లు నిండిన 2లక్షల 39వేల 835 మందికి పరీక్షలు నిర్వహించాం. అవసరమున్న వారికి అద్దాలు పంపిణీ చేశాం. లక్షా79వేల10మందికి ఎలాంటి కంటి సమస్యలు లేవని గుర్తించాం, ఇంకా శిబిరాలు కొనసాగుతున్నాయి. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

*- జి రవినాయక్, కలెక్టర్,మహబూబ్‌నగర్*



# సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలి..

**- టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీపై అభ్యర్థులకు న్యాయం చేయాలి- బీజేపీ ఆధ్వర్యంలో నిరసన దీక్ష**

**మహబూబ్‌నగర్ ప్రతినిధి,మార్చి20,ప్రభాతవార్త :** టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీపై బాధ్యత వహించి, మంత్రి కేటీఆర్ రాజీనామా చేయాలని బీజేపీ నేతలు డిమాండ్ చేశారు. రద్దు చేసిన పేపర్లలో బాధిత అభ్యర్థులకు ఒక్కొక్కరికీ రూ.లక్ష నష్టపరిహారం చెల్లించాలని కోరారు. ఈమేరకు మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరాస్తాలో బీజేపీ నాయకులు నిరసన దీక్ష చేపట్టారు. లీకేజీ వ్యవహారంలో ప్రభుత్వ పెద్దలు ఉన్న కారణంగా విచారణ న్యాయబంద్ధంగా జరగాలని, సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ నిరంకుశ వైఖరి తొలగాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కోశాధికారి శాంతికుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పద్మాజారెడ్డి మాట్లాడారు. దీక్ష చేయడానికి టెంట్ వేసుకుంటే పోలీస్ టెంట్ తొలగించడం ఏంటని ప్రశ్నించారు. అయినా తాము ఎండను సైతం లెక్క చేయకుండా దీక్ష కొనసాగించి అభ్యర్థులకు అండగా నిలిచినట్లు తెలిపారు. పోలీసుల తీరు ఇలాగే ఉంటే భవిష్యత్తులో ఇదే రకమైన పరిమాణాలు ఉంటే బీజేపీ ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్తుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వీరబ్రహ్మాచారి తెలిపారు.


తెలంగాణ చౌరస్తాలో నిరసన దీక్ష చేపట్టిన బీజేపీ నాయకులు

## ప్రజావాణి కార్యక్రమంతో ప్రజా సమస్యల సత్వర పరిష్కారం..

**వనపర్తి జిల్లా ఇంచార్జీ కలెక్టర్ ఆశీశ్ సంగ్వాన్..**

**వనపర్తి ప్రతినిధి,మార్చి20 ప్రభాతవార్త:** ప్రజాసమస్యల సత్వర పరిష్కారం కోసమే ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా ఇంచార్జీ కలెక్టర్ ఆశీశ్ సంగ్వాన్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ ఐడీఓసీ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుండి 50 దరఖాస్తులు స్వీకరించడం జరిగింది. ఈ సందర్భంగా ఇంచార్జీ కలెక్టర్ ఆశీశ్ సంగ్వాన్ మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమం ద్వారా స్వీకరించిన దరఖాస్తులను అక్కడికక్కడే సంబందిత శాఖలు పరిష్కరించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. మొత్తం 50 దరఖాస్తులను స్వీకరించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ పద్మావతి, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.


పజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ ఆశీశ్ సంగ్వాన్

## బాధితులకు అండగా ఉంటాం..

**- మహబూబ్‌నగర్ ఎస్పీ నరసింహ**

**మహబూబ్‌నగర్ ప్రతినిధి,మార్చి 20,ప్రభాతవార్త :** శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ప్రజల సమస్యల పరిష్కారానికి పోలీస్ శాఖ చిత్తశుద్ధితో పని చేస్తుందని, బాధితులకు అండగా ఉంటూ ఫిర్యాదులపై వెంటనే చర్యలు తీసుకుంటామని మహబూబ్‌నగర్ ఎస్పీ నరసింహ తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో వివిధ సమస్యలపై వచ్చిన 13 ప్రజాఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బాధితులకు ఖచ్చితంగా న్యాయం చేస్తామన్నారు. చట్ట వ్యతిరేఖంగా వ్యవహరిస్తూ శాంతి భద్రతలకు భంగం కలిగించే వారిపై కఠినంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. పోలీస్ పరిధిలోని ప్రతి అంశాన్ని పరిష్కరిస్తామన్నారు. ఫిర్యాదులను ఎప్పటికప్పుడు ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలోని అధికారులతో మాట్లాడి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ రాములు,డీఎస్పీ రమణారెడ్డి, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ రాజు,ఆర్ఐ శ్రీనివాస్ కుమార్ పాల్గొన్నారు.


ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ నరసింహ

## ప్రభుత్వ భూములను గుర్తించి కాపాడాలి..

**-నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మార్చి 20 ప్రభాతవార్త:** జిల్లాలో గతంలో నిరుపేదల అవాసాలకు ఉద్ధేశించి సేకరించిన కేటాయింపులు జరుగని ప్రభుత్వ భూమిని గుర్తించి కాపాఆలని జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ ఆదేశించారు. సోమవారం పెద్ద కొత్తపల్లి, కొల్లాపూర్ మండలంలోని సింగోటం, పెంట్లవెల్లిలో క్షేత్ర స్థాయిలో పర్యటించి గతంలో సేకరించిన ప్రభుత్వ భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గతంలో ఎస్సీ,ఎస్టీ,బీసీలకు ఇళ్ల స్థలాలకు కేటాయించేందుకు దాదాపు అన్ని మండలాల్లో ప్రభుత్వ భూమిని సేకరించిందని, వివిధ కారణాల వల్ల కొన్నింటిలో ప్రభుత్వ స్థలం కేటాయించిన అక్క ఇండ్లు నిర్మించుకోకపో వడం, మరికొన్నింటికి కేటాయింపులే చేయకుండా ఉండిపోయాయని తెలిపారు.అలాంటి ప్రభుత్వ స్థలాలను గుర్తించి తదుపరి ప్రభుత్వ ఉత్తర్వులు వచ్చే వరకు ఇతరులు ఆక్రమించుకోకుండా కాపాడాల్సిన బాధ్యత తహసీల్దార్లదేనని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్లు, ఇతర సిబ్బంది తదితరులు ఉన్నారు.


తహసీల్దార్లతో సర్వే కార్యక్రమంలో కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్

# పెండింగ్‌లో ఉన్న కేసులను సత్వరమే పరిష్కరించాలి

- దర్యాప్తులో ఉన్న కేసులలో సమగ్ర విచారణ చేపట్టి చట్టపరంగా నేరస్థులకు శిక్ష పడే విధంగా కృషి చేయాలి
- సైబర్ నేరాలపై ఫిర్యాదు వచ్చిన వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలి
- రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి
- నేర సమీక్ష సమావేశంలో వనపర్తి జిల్లా ఎస్పీ రక్షిత కె.మూర్తి


నెలవారి సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రక్షిత కె మూర్తి

**వనపర్తి క్రైమ్,మార్చి 20ప్రభాతవార్త:** జిల్లాలో నమోదు అవుతున్న ఆయా కేసులలో అధికారులు పకడ్బందీగా పారదర్శకంగా విచారణ చేపట్టాలని, అందుకు క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్ ను పెంపొందించాలని జిల్లా ఎస్పీ రక్షిత కె మూర్తి పోలీసు అధికారులకు తెలిపారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని సమావేశ మందిరంలో జిల్లాలోని ఎస్పీ, సీఐలు, అన్ని పోలీస్ స్టేషన్ ల ఎస్సైలతో జిల్లా ఎస్పీ నెలవారి నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. అందులో భాగంగా జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్‌లలో పెండింగ్ లో ఉన్న కేసుల వివరాలు, యుఐ కేసులను అడిగి పెండింగ్‌కు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ లో ఉన్న కేసులను సత్వరమే పరిష్కరించాలని పోలీసు అధికారులకు ఆదేశించారు. ఈ నేర సమీక్ష సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ తమ పరిధిలో జరిగే నేరాలలో పకడ్బందీగా విచారణ చేసి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు సూచించారు. కేసుల విచారణలో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని, ప్రతి కేసులో సమగ్ర విచారణ చేపట్టి బాదితులకు న్యాయం చేకూరేలా పని చేయాలని అధికారులకు సూచించారు. ప్రతి కేసు ప్లాన్ ఆఫ్ యాక్షన్ చేసుకొని పకడ్బందీగా విచారణ చేపట్టాలని, ఆయా కేసులలో ఫైల్‌లలను పరిశీలించి ఎస్‌హెచ్‌ఓ లకు తగు సూచనలు చేశారు. ప్రస్తుత కాలంలో ప్రజలు రోడ్డు ప్రమాదాలకు ఎక్కువగా గురవుతున్నారని, అందుకు వారికి రోడ్డు నియమాలు, రోడ్డు సేఫ్టీ గురించి ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించాలని అన్నారు. ఇప్పటికే జిల్లాలో గుర్తించిన బ్లాక్ స్పాట్స్‌లలో ప్రమాదాలు జరగకుండా సంబందిత అధికారులతో మాట్లాడి అవసరమైన హెచ్చరిక బోర్డులు, సిగ్నల్, ఇతర మార్పులు, చేర్పులు చేపట్టాలని సూచించారు. ఎస్సైలు తప్పనిసరిగా గ్రామాలను సందర్శించాలని, ప్రతి శనివారం పరేడ్ నిర్వహించి సిబ్బందితో మీటింగ్స్ ఏర్పాటు చేసి విధుల పట్ల ఎలా ముందుకు వెళ్లాలో సూచనలు చేయాలని అన్నారు. ప్రతి వారం కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్ లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి న్యాయధికారులతో సమన్వయం పాటిస్తూ నేరస్తులకు శిక్షలు పడేలా ప్రతి ఒక్కరు బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. బ్లూ కోల్ట్స్ పెట్రోలింగ్ సిబ్బంది తమకు కేటాయించిన విధులను ఖచ్చితంగా పాటించేలా అధికారులు ఎప్పటికప్పుడు వారికి తగు సూచనలు చేయాలని ఆదేశించారు. వర్టికల్స్ కు సంబందించి సిబ్బంది పని తీరును రోజు వారిగా సమీక్షించుకోవాలని ఎస్సైలకు సూచించారు. నేరాల నియంత్రణలో చేదనలో సీసీ కెమరాల ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేసి ప్రతి గ్రామంలో సీసీ కెమరాలను ఏర్పాటు చేసుకునే విధంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని తెలిపారు. 5ఎస్ విధానంలో బాగంగా పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా చూసుకోవాలని, ఫైల్‌లను క్రమ పద్దతిలో అమర్చుకోవాలని సూచించారు. ఈనెల సమీక్ష సమావేశంలో డీఎస్పీ ఆనంద్ రెడ్డి, కొత్తకోట సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఆత్మకూర్ సీఐ రత్నం,డీసీఆర్‌బీ ఎస్సై వెంకటేష్, జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ ల ఎస్సైలు, డీసీఆర్బీలు, సిబ్బంది ఉన్నారు.

## అంతరాష్ట్ర బండలాగుడు పోటీలు

**ఇటిక్యాల,మార్చి 20 ప్రభాతవార్త:** మండల పరిధిలోని షేక్‌పల్లి గ్రామంలో ఉగాది పండగను పురస్కరించుకుని ఈనెల 22,23 తేదీలలో అంతరాష్ట్ర బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామ సర్పంచ్ రవిందర్‌రెడ్డి తెలిపారు. 22న బుధవారం పాలపళ్ల విభాగం బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు ఈ పోటీలో గెలుపొందిన వారికి మొదటి బహుమతి 40 వేలు, ఎర్రవల్లి చౌరస్తాకు చెందిన బికెఎస్ ట్రేడర్స్ మహమ్మద్ ఇలియాస్ దాత.అంతేకాక 8బహుమతులను గెలుపొందిన వారికి అందజేసేందుకు పలువురు దాతలు ముందుకు వచ్చారు. అదేవిధంగా 23 తేదీన న్యూ కేటగిరి బండలాగుడు పోటీలు నిర్వహిస్తుండగా పోటీల్లో గెలుపొందిన విజేతలకు మొదటి బహుమతి రూ. 60 వేలు, దాత షేక్‌పల్లి గ్రామ సర్పంచ్ రవిందర్‌రెడ్డి. ఈ కేటగిరిలలో కూడా గెలుపొందిన విజేతలకు 8 బహుమతులను అందజేస్తుండగా పలు గ్రామాల దాతలు ముందుకు వచ్చారు. అంతేకాక చాలామంది దాతలు అన్నదానం, తాగునీటి సౌకర్యం తదితర సౌకర్యాలు కల్పించేందుకు దాతలు ముందుకు వచ్చినట్లు వారు తెలిపారు.23 ముగింపు రోజుజానపద సాంస్కృతిక కార్యక్రమాలు చిన్నారుల నాట్య ప్రదర్శన తదితర ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

## సిసి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం


సిసిరోడ్డు పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

**మూసాపేట,మార్చి 20 ప్రభాతవార్త:** మూసపేట మండల పరిధిలోని చక్రాపూర్ అనుబంధ గ్రామం కనకాపూర్ తండాలో సోమవారం సిసి రోడ్డు నిర్మాణానికి పనులు ప్రారంభించారు. 10 లక్షల వ్యయంతో వేస్తున్న సిసి రోడ్డు నిర్మాణ పనులకు సర్పంచ్ శైలజ ప్రకాష్‌రెడ్డి, మండల రైతుబంధు అధ్యక్షుడు భాస్కర్ చందర్‌గౌడ్, కొబ్బరికాయకొట్టి ప్రారంభించారు. ఎన్నోఏళ్లుగా ఎదురుచూస్తున్న సిసి రోడ్డు పనులు ప్రారంభం కావడంతో తండావాసులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ గ్రామ కమిటి అధ్యక్షుడు సాయన్న, యాదయ్యగౌడ్ మాజీ సర్పంచ్ శంకర్‌నాయక్‌గౌడ్, నాగన్న,కండియానాయక్, హనుమంతునాయక్, పుల్యానాయక్, రమేష్‌నాయక్ పాల్గొన్నారు.

## ఆత్మీయ సమ్మేళన సమావేశానికి ఎమ్మెల్సీ చల్లాకు ఆహ్వానం


ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి హాజరు కావాలని ఎమ్మెల్సీ చల్లాను ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

**ఇటిక్యాల,మార్చి20 ప్రభాతవార్త :** అలంపూర్ నియోజకవర్గంలో వడ్డేపల్లి మండలం తనగల గ్రామం నుండి ఈనెల 21న బిఆర్ఎస్ పార్టీ నిర్వ హించే ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి హాజరు కావాలని సోమవారం కర్నూలు పట్టణంలో ఎమ్మెల్సీ చల్లా వెంకటరామిరెడ్డిని అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహాం మర్యాద పూర్వకంగా కలిసి ఆహ్వానించారు. ఎమ్మెల్యేల కోటా కింద అలంపూర్ మాజీ ఎమ్మెల్యే చల్లా వెంకట రామిరెడ్డిని ఎమ్మెల్సీగా ముఖ్యమంత్రి కెసిఆర్ ఎంపికచేయగా ఏకగ్రీవంగాఎమ్మెల్సీలా చల్లా వెంకట రామిరెడ్డి ఎన్నికైన సంగతి తెలిసిందే.

## పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా విద్యాధికారి


ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న విద్యాధికారి

**మల్దకల్,మార్చి 20 ప్రభాతవార్త:** ప్రభుత్వ జూనియర్ కళాశాల మల్దకల్‌లో జరుగుతున్న ఇంటర్ పరీక్షల్లో భాగంగా సోమవారం మొదటి సంవత్సరంమాథ్స్,బోటనీ, పొలిటికల్ సైన్స్ సబ్జెక్టులకు సంబంధించిన పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఈ పరీక్షలకుగాను మొత్తం 85 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 78 మంది హాజరైనట్లు 7 మంది గైర్హాజరు అయినట్లు చీఫ్ సూపరింటెండెంట్ నరసింహులు, డిపార్టుమెంటల్ అధికారి రాజేశ్వర్ తెలిపారు. పరీక్ష కేంద్రాన్ని జిల్లా ఇంటర్ విద్యాధికారి ఎం.హృదయరాజు,డీఈసి సభ్యులు రమేష్‌లింగం, దేవేందర్‌రెడ్డి సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు.

## ప్రీస్కూల్ మేళా



**ఉట్కూర్,మార్చి 20 ప్రభాతవార్త:** మండల కేంద్ర పరిధిలోని పెద్దజట్రం, ఆసులోనిపల్లి గ్రామంలో ప్రిస్కూల్ మేళ ఘనంగా నిర్వహించారు. పిల్లలు వివిధ వేషధారణలో అందరిని అలరించారు. కార్యక్రమంలో పెద్దజట్రం, సర్పంచ్ కతలప్ప, పంచాయతీ కార్యదర్శి కృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ సాయిలుగౌడ్, సూపర్‌వైజర్ వైష్ణవి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ గీత, టీచర్స్ అవుసలోనిపల్లి ఎంపిటిసి బెమమ్మ, హెచ్‌ఎం చంద్రశేఖర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి శివానంద, వార్డుమెంబర్ నాగరాజు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## చెక్కుల పంపిణీకి ఎమ్మెల్యే రాక

**ఉట్కూర్,మార్చి 20 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని స్థానిక తహసిల్దార్ కార్యాలయం దగ్గర మంగళవారం ఉదయం 11 గం.లకు కళ్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను స్థానిక ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి చెక్కులు పంపిణీ చేస్తారని కావున వివిధ గ్రామాల్లోని లబ్దిదారులు తహసిల్దార్ కార్యాలయానికి రావాలని టిఆర్ఎస్ మండల అధ్యక్షులు లక్ష్మారెడ్డి సూచించారు. అలాగే జడ్పీటిసి, ఎంపిపి వివిధ గ్రామాలలోని సర్పంచ్‌లు, ఎంపిటిసిలు అందరూ రావాలని సూచించారు.

## తపస్ జిల్లా కార్యదర్శికి ఎమ్మెల్సీ సన్మానం

**ఉట్కూర్,మార్చి 20 ప్రభాతవార్త:** ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తన గెలుపు కోసం నిర్విరామంగా కృషి చేసిన తపస్ నారాయణపేట జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహను హైదరాబాద్‌లోజరిగిన అభినందన సభలో ఎమ్మెల్సీగా విజయం సాధించిన ఏవిఎన్‌రెడ్డి, రాష్ట్రఅధ్యక్షులు హనుమంతరావు,జిల్లా అధ్యక్షులు కృష్ణారెడ్డి ఘనంగాసత్కరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సమస్యలను జిల్లాశాఖ పక్షాన ఎమ్మెల్సీకి వివరించారు.వాటి పరిష్కారం కోసంకృషి చేస్తానని ఏవిఎన్‌రెడ్డి హామీ ఇచ్చారు.



## క్షయ వ్యాధిని నివారించడానికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది

- వనపర్తి జిల్లా ఇంఛార్జ్ కలెక్టర్ ఆశీశ్ సంగ్వాన్


పోస్టర్‌ను విడుదల చేస్తున్న జిల్లా ఇంఛార్జ్ కలెక్టర్ ఆశీశ్ సంగ్వాన్

**వనపర్తి ప్రతినిధి,మార్చి 20ప్రభాతవార్త:** క్షయ వ్యాధిని నివారించడానికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుందని జిల్లా ఇంచార్జీ కలెక్టర్ ఆశీశ్ సంగ్వాన్ అన్నారు. సోమవారం జిల్లా ఐడీఓసీ సమావేశ మందిరంలో నేషనల్ టీ.బీఎలిమినేషన్ ప్రోగ్రాం నిక్షయ పోషణ యోజనకు సంబందించిన పోస్టర్ ను జిల్లాఇంచార్జీ కలెక్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాటాడుతూ క్షయ వ్యాధి నిర్మూలనకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుందని తెలిపారు. నిక్షయ పోషణ అభియాన్ కింద టీబీ వ్యాధి గ్రస్తులకు పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా అందజేస్తామని తెలిపారు. లక్షణాలు ఉన్న వారు సమీప ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు నిర్వహించుకొని మందులు వాడాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్డిఓ పద్మావతి, డీఎంహెచ్‌ఓ రవి శంకర్, ఏఓ సాయినాథ్‌రెడ్డి, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## టిఎస్‌పిఎస్‌సి అక్రమాలపై నిరసన దీక్ష


దీక్ష చేస్తున్న బిజెపి నాయకులు

**మక్తల్,మార్చి 20 ప్రభాతవార్త:** బిజెపి రాష్ట్రశాఖ పిలుపు మేరకు మక్తల్ నియోజకవర్గ కేంద్రంలో టిఎస్‌పిఎస్‌సి అక్రమాలపై నిరసన దీక్ష చేపట్టడం జరిగింది. కార్యక్రమంలో మక్తల్ నియోజకవర్గ ఇంఛార్జి కర్నెస్వామి మాట్లాడుతూ టిఎస్‌పిఎస్‌సి అక్రమాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ప్రశ్నాపత్రాల లీకేజీనాలతో సంబంధం ఉన్న కెటిఆర్‌ను క్యాబినెట్ నుండి వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ప్రశ్నా పత్రాలు లీకేజీల ద్వారా నష్టపోయిన అభ్యర్థులకు 1 లక్షల రూపాయల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్‌చేశారు. నిరుద్యోగులకు న్యాయం జరగకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఇంకా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలోబలరాంరెడ్డి,బిజెవైఎంజిల్లా అధ్యక్షుడు భరత్‌కుమార్,నర్సింహరెడ్డి, కనకరాజు,ఓబిసి మోర్చా నాయకులు మల్లేష్, మండల అధ్యక్షులు రవిందర్‌రెడ్డి, రమేష్, బిజెవైఎం జొత్తి ఉపాధ్యక్షుడు వావిళ్లరవి, శ్రీనివాస్‌రెడ్డి, సందీప్, రమేష్, నిరేష్‌రెడ్డి పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీ వాటర్‌మాన్‌పై దాడి చేసిన దోషులను కఠినంగా శిక్షించాలి


బాధితున్ని పరామర్శిస్తున్న దృశ్యం

**మిడ్జిల్,మార్చి 20 ప్రభాతవార్త:** మండలంలోని బోయిన్‌పల్లి గ్రామ పంచాయతీ కార్మికుడు వాటర్‌మన్ వెంకటయ్యపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేయడం జరిగింది. వారిని వెంటనే శిక్షించాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి తెలుగు సత్తయ్య డిమాండ్ చేశారు. వివరాల్లోకి వెళితే గ్రామ పంచాయతీ కార్మికుడు వాటర్‌మాన్ వెంకటయ్య ఆదివారం రాత్రి 10 గం.ల సమయంలో వాటర్ ట్యాంక్ నుండి నీళ్లు వదలడానికి పోయినప్పుడు వాటర్ ట్యాంక్ దగ్గర గుర్తు తెలియని వ్యక్తులు మద్యం సేవిస్తుండగా వారిని వెళ్లిపోమని అన్నారు. అందుకు గుర్తు తెలియని వ్యక్తులు వాటర్‌మాన్ వెంకటయ్యపై ఒక్కసారిగా దాడికి పాల్పడ్డారని వెంకటయ్య తెలిపారు. ఈ విషయంపై తెలంగాణ గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని దోషులను పట్టుకుని శిక్షించాలని వారిపై కేసు నమోదు చేయాలని సిఐటియు జిల్లా సహాయకార్యదర్శి తెలుగు సత్తయ్య డిమాండ్ చేశారు. దోషులను పట్టుకుని శిక్షించాలని వారిపై కేసు నమోదు చేయాలని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈకేసులు విచారించి దోషులను పట్టుకుని కఠినమైన చర్యలు తీసుకుంటా మని ఎస్సై రాంలాల్‌నాయక్ తెలిపారు.

## అంగన్‌వాడీ కేంద్రంలో ప్రిస్కూల్‌మేళ

**మక్తల్,మార్చి 20 ప్రభాతవార్త:** మక్తల్ మండలంలోని దాసరిదొడ్డి గ్రామంలో అంగన్‌వాడి కేంద్రాలలో ఐసిడిఎస్ ఆదేశాల మేరకు ప్రిస్కూల్ యాక్టివేట్ మేళా నిర్వహించడం జరిగింది. కార్యక్రమానికి మక్తల్ సెక్టార్ సూపర్‌వైజర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అంగన్‌వాడి కేంద్రాలలో ఈనెల మొత్తం మేళాలు నిర్వహించాలని చిన్నారులకు ప్రీస్కూల్ యాక్టివిటి మేళ తెలియజేస్తూ సులభంగా చదువు నేర్చుకునే పద్దతుల్లో బొమ్మలతో పాటలతో చిన్నారులకుబోధన అందించాలని సూచించారు.కార్యక్రమంలో గ్రామ సర్పంచ్,వార్డు మెంబర్లు,తల్లులు,ప్రధానోపాధ్యాయులు, అంగన్‌వాడి టీచర్లు, హెల్పర్స్ పాల్గొన్నారు. అంగన్‌వాడి టీచర్స్ బసవలింగప్ప, సువర్ణ ప్రధానోపాధ్యాయులు గోపాల్‌రెడ్డి,సర్పంచ్ జి.మారెప్ప,హెల్పర్లుకవిత,లక్ష్మి, నర్మద, ఉపాధ్యాయులు రామ్‌కిరణ్,వరుణ్, విదుర్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## కంటి వెలుగును పకడ్బందీగా నిర్వహించాలి

- కంటి వెలుగు ప్రోగ్రాం అధికారి దివ్య


కంటి వెలుగు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ప్రోగ్రామ్ అధికారి డా. దివ్య

**ఇటిక్యాల,మార్చి 20 ప్రభాతవార్త :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న రెండవ విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని ప్రతి ఒక్కరిని క్షుణ్ణంగా పరిశీలించాలని అర్హులైన వారికి కళ్లద్దాలు అందజేయాలని కంటి వెలుగు ప్రోగ్రాం అధికారి డా. దివ్య సూచించారు. సోమవారం మండల పరిధిలోని ఉదండాపురం గ్రామంలో కొనసాగుతున్న రెండవ విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రోగ్రామ్ అధికారి డా. దివ్య పరిశీలించారు. గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమంలో 1 నుండి 5 టేబుళ్ల వరకు సక్రమంగా ఏర్పాటు చేశారా అన్నదానిపై క్షుణ్ణంగా పరిశీలించారు. ఓపి వివరాలు ఇప్పటివరకు పంపిణీ చేసిన కళ్లద్దాల వివరాలు, శస్త్ర చికిత్సలకు కోసం రెఫర్ చేసిన వివరాలను డా.జ్ఞాని వెంకటరాజన్‌తో అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో అందరికి కంటి పరీక్షలు నిర్వహించేలా చూసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో కంటివెలుగు సిబ్బంది,వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## భూమిని అన్యాక్రాంతం కాకుండా సంతకాల సేకరణ


సంతకాల సేకరణ చేస్తున్న దృశ్యం

**మక్తల్,మార్చి 20 ప్రభాతవార్త:** మక్తల్ పట్టణంలోని శ్రీశ్రీశ్రీ పడమటి ఆంజనేయస్వామి దేవాలయంలో ఆలయ మున్సిపల్ భూ పరిరక్షణ సమితి విశ్వహిందూ పరిషత్ భజరంగ్‌ద్ ఆధ్వర్యంలో పడమటి ఆంజనేయస్వామి దేవాలయం భూమి సర్వే నంబర్ 35 విస్తీర్ణము 8 ఎకరాల 24 గుంటలు భూమిని అన్యాక్రాంతం కాకుండా కాపాడుకొనుటకు సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది. కొత్తగా ఏర్పడిన నారాయణపేట జిల్లాలోనే మొదటగా బ్రహ్మోత్సవాలు నిర్వహించుకొనుటకు దేవాలయ భూమి ఉన్న వివిధ రాష్ట్రాల నుండి వచ్చే భక్తులకు దాసంగాల ఏర్పాటుకై నెహ్రూ గంజ్ రాఘవేంద్ర కాలనీ బసవేశ్వర కాలనీ ఇండ్ల ముందర దాసంగాలు ఏర్పాటు చేసుకుని గండజ్యోతులు స్వామివారికి తీసుకుని వస్తారు. ప్రతి ఒక్కరు స్వామివారికి ఉన్న ఎనిమిది ఎకరాల 24 గుంటల భూమి రక్షించుకునేందుకు తమ వంతుగా సంతకాల సేకరణలో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ మున్సిపల్ భూ పరిరక్షణ సమితి అధ్యక్షులు కావలి వెంకటేష్, కార్యదర్శి సత్యనారాయణ గౌడ్, భారతీయ కిసాన్ సంఘ మండల అధ్యక్షుడు కర్నె శ్రీనివాసులు, పాండు,తిరుపతి,చిన్నాన్న విశ్వహిందూ పరిషత్ ప్రఖండ గౌరవాధ్యక్షులు పాడుపల్లిజనార్ధన్,పట్టణ ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్‌రావు, భజరంగ్‌దళ్ జిల్లాప్రముఖ వాకిటి రమేష్, ప్రఖండ ప్రముఖ్ భీమేష్, శ్రీపురం రాములు పాల్గొన్నారు.

## గుప్తనిధుల కోసం వినాయకుడి విగ్రహం తొలగింపు


గుప్తనిధుల కోసం వినాయకుడి విగ్రహం తొలగించిన దృశ్యం

**మిడ్జిల్,మార్చి20 ప్రభాతవార్త:** పురాతన వినాయకుడి విగ్రహం తొలగించి గుప్తనిధుల కోసం గుప్తనిధుల కొరకు తవ్వకాలు చేపట్టిన ఘటన మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండల పరిధిలోని తీవ్రంగా కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే మండల పరిధిలోని కొత్తూరు గ్రామ సమీపంలో గుర్తు తెలియని దుండగులు గుప్తనిధుల కొరకు దుందుభి నది ఒడ్డున ఉన్న పురాతన వినాయకుడి విగ్రహాన్ని తొలగించి పది అడుగుల మేర తవ్వకాలు చేపట్టారు. ఆ ప్రాంతంలో క్షుద్రపూజలు ఉపయోగించి పూజా సామాగ్రితో క్షుద్ర పూజలకు ఉపయోగించి పూజ సామాగ్రితో క్షుద్ర పూజలు చేసిన ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. దీంతో కొత్తూరు గ్రామ ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. సోమవారం అటువైపుగా వెళ్తున్న గ్రామస్తులు గమనించి స్థానిక ప్రజా ప్రతినిధులకు పోలీసులకు సమాచారం అందించారు. విగ్రహాన్ని ధ్వంసం చేసి గుప్తనిధుల కొరకు అన్వేషించిన దుండగులను గుర్తించి వెంటనే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక సర్పంచ్ రాధిక ప్రతాప్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేయడం జరిగింది. ఈ ఘటనకు పాల్పడిన వారిని పట్టుకుని చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై రామ్‌లాల్ నాయక్ తెలిపారు.

## సమాజానికి మార్గదర్శకులు కవులు, కళాకారులు


కవులు, కళాకారులను సన్మానిస్తున్న దృశ్యం

**మక్తల్,మార్చి 20 ప్రభాతవార్త:** సమాజానికి మార్గ దర్శకులు కవులు, కళాకారులని తేనెలొలుకు తెలుగుభాష పదాలకు జీవంపోసి తెలుగు సంస్కృతి సంప్రదాయ ఘనకీర్తిని దేశ దశదిశల చాటుతున్నది. కవులు కళాకారులని మున్సిపల్ ఛైర్‌పర్సన్ గందె అనసూయ చంద్రకాంత్ తహసిల్దార్ దానయ్య ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షులు సుదర్శన్‌రెడ్డిలు అన్నారు. సోమవారం బాలకేంద్రంలో ప్రపంచ కవితా దినోత్సవం ఉగాది పర్వదినోత్సవం సందర్భంగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కవి సమ్మేళనంలో ప్రముఖ కవులు జ్ఞానేశ్వర్‌గౌడ్,తహసిల్దార్ దానయ్య, రామ్మోహన్‌రావు,సర్వేయర్ మల్లేష్, చిన్నయ్య, ధన్వాడ శ్రీశైలం పోటాపోటీగా కవిత్వాలను వినిపించారు. ఈ సందర్భంగా సువర్ణ శ్రావణి బృందం భక్తి గీతాలపై చేసిన అభినయాలతో పాటు గాయకులు సంగ నర్సింహులు మహిపాల్‌రెడ్డి, బాలాజీగౌడ్ ఆలపించిన ఉగాదిపై పాటలు ఆకట్టుకున్నాయి. అంతకు ముందు అనంతరం కవులు,కళాకారులను పూలమాల,శాలువా నారికేళ ఫలముతో సత్కరించారు. వినాయక, సరస్వతి మాత చిత్రపటాలకు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ ఛైర్మన్ సరాఫ్ నాగరాజు, రెడ్‌క్రాస్ సొసైటీ నాగరాజు, మధుసూదన్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, చిన్నారెడ్డి, జొన్నల సుభాష్, బస్సపురం వెంకట్రాములు బాలకేంద్రం సిబ్బంది వసంత్, జ్ఞానామృత తదితరులు పాల్గొన్నారు.

## ముమ్మరంగా కొనసాగుతున్న సిసి రోడ్ల పనులు


వల్లభాపూర్ గ్రామంలో సిసి రోడ్ల నిర్మాణం ముమ్మరంగా కొనసాగుతున్న దృశ్యం

**లింగాల,మార్చి 20 ప్రభాతవార్త:** మండల పరిధిలోని వల్లభాపూర్ గ్రామంలో సోమవారం సిసి రోడ్ల పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. తెలంగాణ రాష్ట్రప్రభుత్వం ఏర్పడిన తర్వాత గ్రామీణ ప్రాంతాలలో అంతర్గత రోడ్ల మహర్ధశ వచ్చిందని సర్పంచ్ తగిలిస్వామి అన్నారు. రూ. 40 లక్షల నిధులతో గ్రామంలో సిసి రోడ్ల నిర్మాణాలు చేపట్టినట్లు తెలిపారు. గ్రామంలో ఎక్కడ చూసినా కూడా మట్టిరోడ్లు లేకుండా సిసి రోడ్లు ఏర్పాటు చేయడం చాలా సంతోషకరమన్నారు. గ్రామీణాభివృద్ధికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే గువ్వల బాలరాజుకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు ప్రసాద్, జయంత్‌రెడ్డి, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షులు వీరారావు, టిఆర్ఎస్ పార్టీ గ్రామపార్టీ అధ్యక్షులు శ్రీనివాసులు పాల్గొన్నారు.

## పాఠశాలలో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తాం

**కల్వకుర్తి, మార్చి 20 ప్రభాతవార్త:** కల్వకుర్తి మండలం ముకురాల గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు మంచినీటి సరఫరా లేక ఇబ్బందులకు గురవుతున్న విషయాన్ని గ్రామస్తులు ఐక్యత ఫౌండేషన్ దృష్టికి తీసుకెళ్లారు. సోమవారం ఐక్యత ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ సుంకిరెడ్డి వరప్రసాద్‌రెడ్డి పాఠశాలను సందర్శించి పాఠశాలలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా సుంకిరెడ్డి వరప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ పాఠశాలలోవాటర్ ప్లాంట్ ఏర్పాటుచేస్తామని హామీఇచ్చారు.కార్యక్రమంలో పాఠశాల,ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు ఉన్నారు.

## ప్రజావాణికి పెరుగుతున్న స్పందన



ఫిర్యాదులను స్వీకరిస్తున్న అధికారులు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మార్చి 20 ప్రభాతవార్త:** ప్రజావాణిలో తహసీల్దార్ల వద్దకు వచ్చే ఫిర్యాదులను అక్కడే క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించే ప్రయత్నం చేయాలని జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ ఆదేశించార. సోమవారం ఉదయం నుంచి కలెక్టరేట్‌లో వచ్చిన ప్రజావాణి ఫిర్యాదులను పీడీ డీఆర్‌డీఏ నర్సింగ్‌రావు, సీపీఓ భూపాల్‌రెడ్డిలు ప్రజావాణి ఫిర్యాదులో 51 ఫిర్యాదలు స్వీకరించినట్లు తెలిపారు.వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు చొరవ చూపాలన్నారు. ప్రజావాణిలో ఆయా శాఖల జిల్లా అధికారులు తదితరులు ఉన్నారు.

## ఆలయాభివృద్ధికి రూ.2.50లక్షల విరాళం



విరాళం అందజేస్తున్న సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి

**వెల్దండ, మార్చి20 ప్రభాతవార్త:** వెల్దండ మండల పరిధిలోని గానుగ్టుతండాలో వెలిసిన శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయాభివృద్ధికి అన్ని విధాల సహకరిస్తానని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, ఎన్‌ఆర్‌ఐ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణ పున: ప్రతిష్టా కార్యక్రమంలో భాగంగా సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి సోమవారం రూ.2.50లక్షల విరాళాన్ని ఆలయ కమిటీ నిర్వాహకులకు అందించారు. నియోజకవర్గంలో అసంపూర్తిగా నిలిచిన ఆలయాభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు.కార్యక్రమంలో ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ వరప్రసాద్‌రెడ్డి, ఉప సర్పంచ్ మార్వతిరమేష్, సురేష్‌రెడ్డి, తరుణ్, నర్శ, రమేష్ తో పాటు ఫౌండేషన్ సభ్యులు, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

## పోచమ్మ గడ్డ తండాకు పంచాయతీ భవనాన్ని మంజూరు చేయాలి



ప్రజావాణి కార్యక్రమంలో వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

**వెల్దండ, మార్చి 20 ప్రభాతవార్త:** మండల పరిధిలోని పోచమ్మగడ్డ తాండకు నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని మంజూరు చేయాలని కోరుతూ సర్పంచ్ వరలక్ష్మిపంతులనాయక్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ వరలక్ష్మిపంతులనాయక్ మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన గ్రామ పంచాయతీలకు భవనాలు మంజూరు చేశారని, పోచమ్మగడ్డ తాండకు మంజూరు కాలేదన్నారు. గ్రామ పంచాయతీ భవనం లేక చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, గ్రామ పంచాయతీ భవనాన్ని మంజూరు చేయాలనికోరారు.కార్యక్రమంలో లక్ష్మన్,జగ్గుతో పాటు తదితరులు ఉన్నారు.

## క్లాస్‌మెట్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్యాడ్ల అందజేత



విద్యార్థులకు ప్యాడ్లు అందజేస్తున్న దృశ్యం

**వెల్దండ, మార్చి 20 ప్రభాతవార్త:** వెల్దండ మండల కేంద్రంలో జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో క్లాస్‌మెట్ క్లబ్ కల్వకుర్తి డివిజన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులుగా విధులు నిర్వర్తిస్తున్న శ్రీనాథ్ కుమారుడు వర్షిత్ పుట్టిన రోజును పురస్కరించుకొని పరీక్ష ప్యాడ్లు, పెన్నెలను ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, ఉప్పల వెంకటేష్, వెల్దండ గ్రామ సర్పంచ్, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షులు యెన్నం భూపతిరెడ్డి, ఆర్య వైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు బచ్చు రామకృష్ణ చేతుల మీదుగా అందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్య ద్వారానే సమాజంలో మంచి గుర్తింపు ఉంటుందని,విద్యకై ఏమాత్రం ఆశ్రద్ధ వహించకుండా విద్యార్థులు ఉన్నతంగా చదువుకొని లక్ష్యాలకు చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో క్లబ్ జిల్లా ప్రతినిధి శోభన్‌బాబు, ప్రధానోపాధ్యాయులు అంజయ్య, ఉప్పు ఆంజనేయులు,మిర్యాల రాజయ్య,చిత్తరంజన్, రాఘవేందర్‌తో పాటు తదితరులు ఉన్నారు.

## పాఠశాలలో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తాం



విద్యార్థులతో మాట్లాడుతున్న సుంకిరెడ్డి వరప్రసాద్‌రెడ్డి

**కల్వకుర్తి, మార్చి20 ప్రభాతవార్త:** కల్వకుర్తి మండలం ముకురాల గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠ శాలలో విద్యార్థులు మంచినీటి సరఫరా లేక ఇబ్బందులకు గుర వుతున్న విషయాన్ని గ్రామస్తులు ఐక్యత ఫౌండేషన్ దృష్టికి తీసు కెళ్లారు. సోమవారం ఐక్యత ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ సుంకిరెడ్డి వరప్రసాద్‌రెడ్డి పాఠశాల ను సందర్శించి పాఠశాలలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకు న్నారు.ఈ సందర్భంగాసుంకిరెడ్డి వరప్రసాద్‌రెడ్డి మాట్లాడు తూ పాఠశాలలో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పాఠశాల, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు ఉన్నారు.

# స్వర్గానికి మార్గం.. పవిత్ర రంజాన్ మాసం

- మూడు రోజులలో రంజాన్‌మాసం ప్రారంభం
- ప్రత్యేక ప్రార్థనలతో తరించనున్న ముస్లిం సోదరులు
- కఠోర నియమాలతో కూడిన నెలరోజుల ఉపవాస దీక్షలు
- రంజాన్ మాసంలోనే దివ్యఖురాన్ అవతరించిందని ప్రగాఢ విశ్వాసం
- కరోనా నిబంధల మధ్య ముస్లిం సోదరులు వేడుకలు



ప్రార్థనలు చేస్తున్న బాలురు



దేవరకద్రలోని మజీద్

**దేవరకద్ర,మార్చి 20 ప్రభాతవార్త:** ముస్లిం సోదరులు పవిత్ర రంజాన్ (మాహె రంజాన్) మాసాన్ని అత్యంత పవిత్రంగా భావిస్తారు. 3 రోజుల్లో రంజన్ మాసం ప్రారంభం కానుంది. ఆకాశంలో నెలవంక చంద్రుడు కనిపించిన మరుసటిరోజే దీక్షలను ప్రారంభిస్తారు. ఏడాదిలోని పన్నెండు నెలల్లో ఈనెల అత్యంత ప్రాధాన్యత ఇస్తారు. రంజాన్ మాసంలోనే ముస్లిం సోదరులకు పవిత్ర గ్రంథమైన దివ్యఖురాన్ అవతరించిందని ముస్లిం సోదరులు ప్రగాఢ విశ్వాసం. ఈ నెలలో చేసే ప్రతిపుణ్యకార్యానికి 70 ఏళ్ల ప్రతిఫలం లభిస్తుందని విశ్వసిస్తారు. ఉపవాసదీక్షలు (రోజా) వల్ల దైవ ప్రీతి, భయం జనిస్తుందని భావిస్తారు. దీంతో ముస్లిం సోదరులు అత్యంత భక్తి ప్రపత్తులతో కఠోర నియమాలతో కూడిన ఉపవాస వ్రత దీక్షలను పాటిస్తారు. నెల రోజులపాటు దివ్య ఖురాన్‌ను పఠించి దీని అనంతమైన భావజాలంలో ఓలలాడి ఈ మాసంలో తరిస్తారు. ఉపవాస దీక్షలు ప్రతి ముస్లిం పై విధంగా ఉంటాయని భావిస్తారు. ప్రాపంచిక జ్ఞానం తెలిసిన వారందరూ ఉపవాస దీక్షలు విధిగా ఉంటారు. అందుకే ఈ మాసాన్ని ఎంతో భక్తి శ్రద్ధలతో జరుపుకొంటారు.ఆకాశంలో నెలవకం చంద్రుడు కనిపించినప్పటి నుండి ప్రారంభమయ్యే ఉపవాస దీక్షలు మళ్లీ నెలవకం చంద్రుడు కనిపించే వరకు ఈ దీక్షలు నిర్వహిస్తారు. నలవంక చంద్రుడు కనిపించిన మరుసటిరోజు రంజన్ పండగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకుంటారు.

**నెలరోజుల పాటు విశేషాలు:** పవిత్ర రంజాన్ మాసంలో 30 రోజుల (నెల) పాటు ఉపవాస దీక్షలు పాటించాలి. సూర్యోదయం కంటే ముందు నిర్ధారిత సమయంలో ఆహార పానీయాలు తీసుకోవాలి. దీనిని సహరి అని అంటారు. సూర్యాస్త సమయంలో ప్రతిరోజు కొన్ని నిమిషాల తేడాతో ఉపవాస దీక్ష విరమిస్తారు. దీనిని ఇఫ్తార్ అని అంటారు. బెండు ఖర్జూరం తదితర పండ్లతో ఉపవాస దీక్షను విరమిస్తారు. దీక్షా సమయంలో నోటిలోని లాలాజలాన్ని కూడా మింగకూడదు. ఏ వస్తువు రుచి చూడరాదు. వాసన పీల్చరాదు, చెడు మాటలను ఉచ్చరించరాదు. వీటివల్ల దీక్షకు భంగం కలుగుతుందని భావిస్తారు. ఉపవాస దీక్ష సమయంలో విధిగా నమాజ్ చేయాలి. ఆరోగ్య ధర్మ విరుద్ధమైన చర్యలకు పాల్పడకుండా ఉండాలి. అపవిత్రమైన చర్యల వల్ల ఉపవాస దీక్ష లక్ష్యం దెబ్బతింటుంది. ఉపవాస దీక్ష కేవలం ఆహారం, నీరు తీసుకోవడమే కాదు దీక్షాపరులు అన్ని రకాల చెడుకార్యాలకు దూరంగాఉడాలి.రంజాన్ మాసంలో ముస్లింలు ఎంతో భక్తి భావంతో నడుచుకుంటారు.అల్లా ఏడాదిలో రంజాన్ మాసం పూర్తిగా తమ విశ్వాసంచాటుకునేందుకు కేటాయించారన్నదే నమ్మకం.పురుషులు, మహిళలు అనేతేడా లేకుండాతెలివిగల ప్రతిఒక్కరూ ఖచ్చితంగారోజా ఉంటారు.

**ప్రతిరోజు 5 పూటల నమాజ్ తప్పనిసరి:** రంజాన్ మాసంలో ప్రతిరోజు 5 పూటల నమాజ్ ఖచ్చితంగా చేస్తారు. ఫజర్, జొహర్, అసర్, మగ్‌రిబ్, ఇషా ఈవిధంగా (5 పూటల చొప్పున) నమాజ్‌లను చదువుతారు. అలాగే ప్రతిరోజు ఇషా నమాజ్ అనంతరం కేవలం రంజాన్ మాసంలోనే ప్రత్యేకంగా ఉండే 20 రకాతుల (తరావి) నమాజు చదువుతారు. రంజాన్ మాసంలో ముస్లింలు ఉపవాసాలు ఉండడమే కాకుండా ప్రతి ఒక్కరి ఆకలి దప్పుల గురించి తెలుసుకోవడం కూడా రంజాన్ ఉపవాస దీక్షలోని ముఖ్య ఉద్దేశం.ఉపాస దీక్షవల్ల మానసిక ప్రశాంతత, నైతికంగా, సామాజిక ప్రయోజనాలు కలుగుతాయి.సూర్యోదయం కంటేముందు నుంచి సూర్యాస్తమయం ధర్మసమ్మతమైన ఆహార నియమాలను సైతం పక్కన పెడతారు. ఫలితంగా ఓపిక, ఆకలి, బాధల వల్ల ఇతరుల పట్ల ఆప్యాయత కలుగుతుంది. మానసిక పరిపక్వత పెరుగుతుందని భావిస్తారు.

**ఆ 10 నిమిషాలు చాలా ముఖ్యమైనవి:** దీక్షా విరమణకు 10నిమిషాల ముందు దువా (వేడుకోవడం) చేసి కోరే కోరికలను ఆ దేవుడు ఖచ్చితంగా నెరవేరుస్తాడన్నది ప్రగాఢ విశ్వాసం. అందుకే దీక్షాపరులు ఖచ్చితంగా ఆ సమయంలో ఆ దేవుడ్ని తమ యోగ క్షేమాల కోసం ప్రార్థిస్తారు.అలాగే ఈ మాసంలో ప్రతి శుక్రవారానికి కూడా అధిక ప్రాధాన్యత ఇస్తారు. అందుకే ఈ మాసాన్ని వరాల వసంతంగా భావిస్తారు.

**రంజాన్ మాసంలో విశిష్ట కార్యం దానధర్మాలు:** రంజాన్ మాసంలో మరో విశిష్టత కార్యం విరివిగా చేసే దానధర్మాలు.దేవుడు సృష్టించిన మానవ సముదాయంలో అంతరాలు లేని జీవితాలు ఉండాలనేది కూడా ఓ నిర్దేశిక సూత్రం. ఈ మాసంలో పేద ముస్లింలకు సంపద కలిగిన వారు చేసే దానధర్మాలు విశేషంగా నిలుస్తాయి. నిరుపేద అయినవారు, దూరమైన అభాగ్యులు, వితంతువులు,వికలాంగులు,అగత్యులను చేరదీయడం, సాధ్యమైనంత సహాయం చేయడం ముఖ్యమైన విధిగా భావించి ముస్లింలు ఈ మాసంలో దానధర్మాలకు అధిక ప్రాధాన్యత ఇస్తారు.

**ఘనమైన రాత్రి లైలతుల్ ఖదర్ జాగరణ రాత్రి:** రంజాన్ మాసంలో వచ్చే లైలతుల్ ఖదర్ జాగరణ రాత్రికి అధిక ప్రాధాన్యత ఇస్తారు. ఈ ఘనమైన రాత్రి వేయి నెలలకంటే శ్రేష్టమైదిగా విశ్వశిస్తారు. రంజాన్ మాసపు చివరి దశలో ఈ జాగరణ రాత్రి వస్తుంది. అందుకే ఈ రాత్రి ప్రతి ముస్లిం సోదరులు విధిగా ప్రత్యేక ప్రార్థనల్లో మునిగి తేలుతారు.

### చాలా పవిత్ర మాసం



రంజాన్‌మాసం చాలా పవిత్రమైన మాసం. ప్రతి ఏడాది రంజాన్ మాసంలో ఉపవాసం దీక్షలు ఉండటానికి సమయం దొరకడాన్ని అదృష్టంగా భావించాలి. ఈ మాసంలో చేసే ప్రతి ప్రార్థనను ఆ దేవుడు ఆలకిస్తాడు. ఇంతటి విశిష్టత గల మాసంలో దానధర్మాలతో పాటు సన్మార్గంలో నడవడానికి ప్రతి ఒక్కరు ప్రయత్నించాలి.మాసంలో చేసే ప్రతి ప్రార్థనను ఆ దేవుడు ఆలకిస్తాడు. ఇంతటి విశిష్టత గల మాసంలో దానధర్మాలతో పాటు సన్మార్గంలో నడవడానికి ప్రతి ఒక్కరూ ప్రయత్నించాలి.

**-హఫీజ్ మొహ్మద్ అలీఖాద్రి, దేవరకద్ర జామెమజీద్**

# ప్రజా ఫిర్యాదులను పెండింగ్ ఉంచకుండా సత్వరమే పరిష్కరించాలి

### ■గద్వాల జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్

**గద్వాల ప్రతినిధి,మార్చి 20 ప్రభాతవార్త:** ప్రజా ఫిర్యాదులను పెండింగ్ ఉంచకుండా సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులకు, తహసిల్దార్‌కు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశం హాలులో ఏర్పాటు చేసిన ప్రజావాణి సందర్భంగా జిల్లాలో వివిధ ప్రాంతాల ప్రజల నుండి వచ్చిన 109 ఫిర్యాదులను జిల్లా కలెక్టర్ స్వీకరించారు. వీటిలో ఆసరా పెన్షన్7, మిగతవి ధరణికి సంబంధించిన భూ సమస్యలపై దరఖాస్తులు వచ్చాయని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయా శాఖల జిల్లా అధికారులు సంబంధిత మండల అధికారులతో చర్చించి వారి పరిధిలోని దరఖాస్తులు వారంలోపు పరిష్కరించేలా తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. భూ సమస్యలపై వచ్చిన దరఖాస్తులను పరిశీలించి మీ సేవలో సక్సెషన్ కింద దరఖాస్తు చేసుకోవాలని దరఖాస్తుదారుడికి వివరించారు. గట్టు, గద్వాల, అయిజ, ఉండవెలి, దరూర్, మండలాలకు సంబంధించిన పలు గ్రామాల ప్రజలు ఇచ్చిన భూ సమస్యలపై ఫిర్యాదులను పరిశీలించి ఆయా మండలాల తహసిల్దార్‌లతో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అపూర్వ చౌహాన్, ఎఓ యాదగిరి, సూపరింటెండెంట్ రాజు,మదన్‌మోహన్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో క్రయ విక్రయాలు జరపాలి

### ■అదనపు కలెక్టర్ మయాంక్ మిత్తల్



మార్కెట్‌ను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ మయాంక్ మిత్తల్

**నారాయణపేట ప్రతినిధి,మార్చి 20 ప్రభాతవార్త:** సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ సాయంత్రం జిల్లా కేంద్రంలోని సమీకృత మార్కెట్‌ను పరిశీలన సందర్భంగా జిల్లా కేంద్రంలోని వీధి విక్రయదారులు అందరు సమీకృత మార్కెట్‌లో వ్యాపార కలాపాలు జరపాలని ఆదేశించారు. జనవరి 23న ఐటిశాఖ మంత్రి కెటిఆర్ చేతుల మీదుగా ప్రారంభించారు.ఇప్పటికే మార్కెట్‌లో చిరు వ్యాపారం నిర్వహించడం జరుగుతుందని కాబట్టి ఇంకా కొందరు రోడ్డుపై వ్యాపారాలు చేస్తున్నారు. వాందరు ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లోనే వ్యాపారాలు చేయాలన్నారు. అలాగే జిల్లా కేంద్రంలోని హైదరాబాద్‌రోడ్డులో ఏర్పాటు చేస్తున్న పార్కు పనులను పర్యవేక్షించారు.అనంతరం డంపింగ్ యార్డును పరిశీలించి పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ సునిత, ఎఈ మహేష్ ఉన్నారు.

# వందేళ్లు గుర్తుండిపోయేలా పనులు చేపట్టాం..

(మొదటి పేజీ తరువాయి భాగం)

చెక్‌డ్యాంల నిర్మాణంపూర్తి చేశామని గ్రామాలు, తండాలకు సిసి, బిటి రహదారులను నిర్మించామన్నారు. ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవిందర్‌రావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం, దేశంలోని మిగతా రాష్ట్రాలకు భిన్నంగా అభివృద్ధిలో ముందంజలో ఉందని కరెంటు, సాగునీరు పుష్కలంగా ఉందన్నారు. తెలంగాణ గడప గపడకూ తాగునీరు అందించగలుగుతున్నామన్నారు. గత ప్రభుత్వాలు ఎందుకు తాగునీరు అందించలేకపోతున్నామని నాడు వలసెళ్లిన పాలమూరుకు ఇతర రాష్ట్రాల కూలీల వలస వస్తున్నారని, తాగు,సాగునీళ్ల కరెంటు పంచాయతీలు, తెలంగాణలో లేవని గత ప్రభుత్వాల్లో అన్నింటికి ఆందోళనలేనని రైతుబంధు, రైతుభీమా పథకాలు విజయవంతంగా అమలవుతున్నాయన్నారు. వనపర్తి, పాలమూరు బిడ్డలు తెలంగాణ రాష్ట్రంలో ఆనందంగా ఉన్నారన్నారు. 75 ఏళ్ల నష్టపోయిన తెలంగాణ నేడు సుభిక్షమవుతుందని, వనపర్తి జిల్లా అయింది ఎంతోఅభివృద్ధి చెందుతుందన్నారు.రాబోయే రోజుల్లో ప్రజలందరికి ఉపాధి లక్ష్యంగా ప్రణాళికా బద్ధంగా ముందుకు సాగుతామన్నారు. అర్హులకు దశలవారిగా డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించి ఇస్తామన్నారు. వచ్చే వానాకాలం తర్వాత సాగునీరు కొరత అనే మాట ఉండదని, చేతికి శస్త్ర చికిత్స జరిగి వైద్యులు 45 రోజులు విశ్రాంతి తీసుకోమన్నా కేవలంమూడురోజులే విశ్రాంతితీసుకున్నానన్నారు. కాంగ్రెస్, బిజెపిపాలిత రాష్ట్రాలలో కరెంటు,సాగునీరు,గురుకులాలు, రైతుబంధు,రైతుభీమా,కెసిఆర్ కిట్,కళ్యాణలక్ష్మిపథకాలు ఎందుకు లేవన్నారు. వ్యవసాయరంగమే ఉపాధిగాఆధారపడిన 2.40 కోట్ల ప్రజల కోసం సాగునీరు, ఉచిత కరెంటు,రైతుభీమా,రైతుబంధు పథకాలతో ఆత్మవిశ్వాసంనింపిన ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వమన్నారు. ఈరోజు తెలంగాణ సాధించిన విజయాలకు కెసిఆర్ పట్టుదల, చిత్తశుద్ధి కారణమన్నారు. మిగిలిన రంగాలమీద ఇకనుండి ప్రభుత్వం దృష్టి సారిస్తుందన్నారు.






కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి నిరంజన్‌రెడ్డి, పాల్గొన్న కార్యకర్తలు,నాయకులు

### కోయిల్‌సాగర్‌లో

# ఉట్టిపడుతున్న.. జీవవైవిధ్యం

- పర్యాటకులను అకట్టుకుంటున్న వివిధ రకాల పక్షులు
- ప్రశాంత వాతావరణం.. కోయిల్‌సాగర్ సొంతం

**దేవరకద్ర,మార్చి 20 ప్రభాతవార్త:** జిల్లాలోని భారీ నీటిపారుదల ప్రాజెక్టు కోయిల్‌సాగర్ వద్ద జీవవైవిధ్యం ఉట్టిపడుతుంది. ప్రాజెక్టు వద్ద కనిపించే వివిధ రకాల పక్షులు కోయిల్‌సాగర్‌కు వలస వస్తుంటాయి. ప్రతిరోజు ఉదయం,సాయంత్రం వేళ వివిధ రకాల పక్షులు నీటిలో, పరిసరప్రాంతాలలో సేదతీరుతూ చూపరులను ఎంతగానో ఆహ్లాదపరుస్తున్నాయి.రంగు రంగుల పక్షులు అటూఇటూ తిరుగుతూ చూపరుల దృష్టిని బాగా ఆకర్షిస్తున్నాయి.ఓ పక్క చల్లని గాలి,ప్రశాంత వాతావరణం కోయిల్‌సాగర్ సొంతం.కోయిల్‌సాగర్ ప్రాజెక్టు కుడి,ఎడమ కాలువల ద్వారా ఆయకట్టుకు నీటిని వదులుతున్నారు. ఈ నీరు పారే దృశ్యం కూడ హైలెట్ అని చెప్పవచ్చు. ప్రాజెక్టు నుండి ఆయకట్టు వైపు పరుగులు తీసే నీటిని చూసి పర్యాటకులు మంత్ర ముగ్దులవుతున్నారు. కొంతమంది సరదా కోసం కోయిల్‌సాగర్ కాలువలలో చేపలను వేటాడుతూ సేదతీరుతున్నారు.మరికొంతమంది ప్రాజెక్టు వద్దే వనభోజనాలు చేసి హాయిగా పొద్దస్తమానం హాయిగా గడుపుతున్నారు.కోయిల్‌సాగర్ ప్రాజెక్టు వద్ద కనిపించిన వివిధ రకాల పక్షులను తమ ఫోన్‌లలో, కెమెరాలలో బందిస్తున్నారు.



కోయిల్‌సాగర్ కాలువ



కోయిల్‌సాగర్ వద్ద కనిపించిన వివిధ రకాల పక్షులు